

ఆ స్థలం అభివృద్ధిపై చిత్తశుద్ధి ఏది ?



- పార్కు ఏర్పాటుకు డిమాండ్ - ఇప్పటికే అనేక సార్లు సిపిఎం పోరుబాట

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగర శివార్లలోని పాత డంపు యార్డు స్థలం అభివృద్ధిపై పాలకుల్లో చిత్తశుద్ధి కనిపించడం లేదు. డంపు యార్డును వేరే ప్రాంతానికి తరలించడంతో ఆ స్థలం ఖాళీగా మారింది. ఆ స్థలంలో పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ వినిపిస్తోంది..

కర్నూలు నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే పార్కు ఎక్కడా లేనటువంటి పరిస్థితి ఉంది. కర్నూలు నగర శివార్లలోని పాత డంపు యార్డు స్థలంలో పార్కును అభివృద్ధి చేయాలని గత కొన్ని సంవత్సరాలుగా సిపిఎం పార్టీ పోరాటం చేస్తూ ముందుకు సాగింది. పోరాటానికి ప్రజలు కూడా మద్దతు తెలిపారు. పాలకులు మాత్రం పాత డంపు యార్డును పార్కుగా అభివృద్ధి చేయడంలో వైఫల్యం చెందుతున్నారు. కర్నూలు నగరంలోని నడిబొడ్డున జోహరాపురం సమీపంలో మున్సిపాలిటీకి సంబంధించిన డంప్ యార్డ్ దాదాపుగా 28 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ స్థలం కూడా కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ రామయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డు పరిధిలోకి వస్తుంది. కర్నూలు మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుండి ఇక్కడే కర్నూలు నగరానికి సంబంధించినటువంటి వ్యర్థాలను డంప్ చేసేవారు. అయితే 2009 నుండి సిపిఎం ఆధ్వర్యంలో డంప్ యార్డును ఇక్కడి నుంచి తరలించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పోరాటం చేపట్టారు. ఈ పోరాట ఫలితంగా 2013 సంవత్సరంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు డంపు యార్డును అక్కడి నుండి గార్గేయపురం గ్రామానికి తరలించారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఈ స్థలంపై రాజకీయ పార్టీల నేతలు కన్ను పడింది. ఈ స్థలాన్ని మొత్తం లీజు తీసుకొని ప్రైవేట్ కార్యకలాపాలకు నిర్వహణకు కొంత మంది నాయకులు పైరవీలు కూడా చేశారు. అప్పటి ప్రభుత్వం కూడా ఈ ఖాళీ స్థలంలో ప్రైవేట్ పార్ట్నర్షిప్ పద్ధతిలో అభివృద్ధికి చర్యలు తీసుకుంటూ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఈ ఉత్తర్వులను కూడా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోకుండా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చినటువంటి వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఉత్తర్వులను పట్టించుకోలేదు. నగరం మేయర్ బివై రామయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డు పరిధిలో ఉన్న డంపు యార్డు అభివృద్ధికి మాత్రం చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అన్ని వర్గాల మద్దతు తీసుకొని ఇక్కడ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పోరాటం చేసింది. వెంటనే ఇక్కడ పార్కు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పార్కుగా అభివృద్ధి చేయాలి

- ఎం విజయ్, సిపిఎం జిల్లా నాయకులు



జొహరాపురంలో ఉన్న పాత డంప్ యార్డును ఎన్టీఆర్ గార్డెన్ తరహాలో పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాద వాతావరణం కల్పించాలి. కర్నూలు నగర ప్రజలకు కుటుంబ సభ్యులతో కలిసి ఎక్కడికైనా వెళ్లి ఆహ్లాదకరమైన వాతావరణం పొందేందుకు పార్కు లేదు. ఇక్కడున్నటువంటి ఖాళీ స్థలాన్ని వెంటనే పార్కుగా అభివృద్ధి చేస్తే ఎంతో ఉపయోగపడుతుంది.

పార్కును ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగం

- మల్లీ, జొహరాపురం వాసి.



పాత డంప్ యార్డు స్థలంలో వెంటనే పార్కు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. కర్నూలులో ప్రస్తుతం ఉన్నటువంటి ఈ రెండు పార్కులు ప్రజలకు అంత ఉపయోగకరంగా లేవు. ఇక్కడున్నటువంటి ఇంత పెద్ద మొత్తం స్థలంలో పార్కుగా అభివృద్ధి చేస్తే కార్పొరేషన్‌కు ఆదాయం రావడమే కాక ప్రజలు కూడా సాయంకాల వాతావరణంలో ఆహ్లాదాన్ని పొందేందుకు అవకాశం ఉంటుంది.

నగరంలో భారీ అగ్ని ప్రమాదం

ఆకతాయిల పనేనని అనుమానం - ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలోని ఒక్కెర వాగు కొత్త బస్టాండ్ నుండి కల్లూరు వైపు వెళ్లే రోడ్డు బ్రిడ్జి సమీపంలో ప్రతి శనివారం పొట్టేళ్ల వారం సంత జరిగే ప్రాంతంలో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. వ్యాపార షెడ్లు కాలి బూడిదయ్యాయి. వాటి విలువ మొత్తం సుమారు రూ.కోటిన్నర ఉంటుందని అంచనా. వివరాల్లోకి వెళితే ఘటనా స్థలంలో మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో ప్రతి శనివారం కొత్త బస్టాండ్ నుండి కల్లూరుకు వెళ్లే ప్రాంతంలో పొట్టేళ్ల సంత నిర్వహించే మైదానంలో మారుతి సుజుకి సర్వీస్ సెంటర్ తోపాటు కొన్ని కలప విక్రయ కేంద్రం ఫర్నిచర్ షాపు ఆటో గ్యారేజీలు నిర్వహిస్తున్నారు. సరిగ్గా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఆ షాపుల వెనుక వైపు నుంచి పెద్ద ఎత్తున మంటలు గుప్పుగుప్పున పొగలు వెలువడ్డాయి. ఇది చూసిన స్థానిక ప్రజలు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందివ్వడంతో రెండు ఫైర్ ఇంజన్లు అక్కడికి చేరుకొని ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. దాదాపు మూడు నాలుగు గంటల దాకా మంటలను ఆర్పేందుకు సిబ్బంది శ్రమించారు. ఎట్టకేలకు మంటలు అదుపులోకి వచ్చాయి. కాగా అప్పటికే ఆ షాపుల్లో ఉన్న వివిధ మిషన్‌లు, ముడి సరుకులు, చెక్క సామాన్లు, ఫర్నిచర్లు

అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతం . కాలిపోయిన షెడ్లు, పరికరాలు



వాహనాలు షెడ్లు సర్వం కాలి బూడిదయ్యాయి. ఇది మొత్తం విలువ సుమారు కోటిన్నర ఉంటుందని అంచనా.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిపిఎం బృందం

ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ తన బృందంతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులకు తక్షణమే ప్రభుత్వం న్యాయం చేయాలని వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురు శేఖర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై నగేష్, తదితరులు పాల్గొన్నారు.



ఘటనా స్థలాన్ని సందర్శించి మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

అక్రమ రవాణాపై గట్టి నిఘా

- ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి - కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్.విజయరావు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆదివారం కర్నూలు తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలోని అంతర్ రాష్ట్ర సరిహద్దు కర్నూలు - పంచలింగాల చెక్ పోస్టును కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్.విజయరావు ఆదివారం ఆకస్మికగా పరిశీలించారు. చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులకు కర్నూలు డిఐజి పలు ఆదేశాలు జారీ చేశారు. జాతీయ రహదారుల గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా అక్రమంగా తరలించే నగదు , మద్యం, ఇతర కానుకల రవాణాను అరికట్టాలన్నారు. సరైన ఆధారాలు లేకుండా రూ. 50 వేలకు మించి నగదు లభ్యమైతే సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించాలని సూచించారు. చెక్ పోస్టుల వద్ద విధుల్లో నిర్లక్ష్యం చేస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. చెక్ పోస్టులలో పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలీసు అధికారులు , సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వేసవి కాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున విధులు నిర్వహించే సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తెల్లని టోపీలు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని పోలీసు అధికారులకు డిఐజి తెలిపారు. కర్నూలు రేంజ్ డిఐజితో పాటు పంచలింగాల చెక్ పోస్టులో కర్నూలు తాలుకా సిఐ శ్రీధర్, కర్నూలు తాలుకా ఎస్ఐ పీరయ్య , సెబ్, కమర్షియల్ ట్యాక్స్, ఆర్‌టిఒ సిబ్బంది ఉన్నారు.



పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న డిఐజి



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న నేతలు

మతోన్మాద బిజెపి తొత్తులను ఓడించండి

భగత్‌సింగ్ వర్ధంతి సభలో నేతల పిలుపు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాద బిజెపి తొత్తులను ఓడించాలని ఆయన వర్ధంతి సభలో సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఐద్వా నాయకులు ప్రజలను కోరారు. ఐభగత్ సింగ్ వర్ధంతి సభను సిఐటియు, డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, ఐద్వా నాయకురాలు జయమ్మ మాట్లాడారు. దేశ స్వతంత్రం కోసం ప్రాణాల అర్పించిన భగత్ సింగ్ వర్ధంతి జరుపుకోవడం ఎంతో సంతోషకరమైనదన్నారు. ఆ రోజుల్లో బ్రిటిష్ వాళ్లను ఈ దేశం నుండి వెళ్లిపోవాలని అనేక పోరాటాలు దేశంలో నిర్వహించారన్నారు. ఆ రోజుల్లో దేశంలో మహిళలు,కార్మికుల హక్కులు, విద్య వైద్యం ,ఏమీ లేవన్నారు. ఈ దేశం బాగుపడాలంటే బ్రిటిష్ వాళ్ళు ఈ దేశం నుంచి వెళ్లిపోవాలని పార్లమెంటులో భారతదేశానికి వ్యతిరేకంగా చట్టాలు చేస్తుంటే భగత్ సింగ్ ,రాజుగురు, సుఖదేవ్ ముగ్గురు కలిసి ప్రాణ హాని లేకుండా పార్లమెంట్లో పొగ బాంబులు వేశారన్నారు. అక్కడే ఉంటూ ఇన్‌క్విలాబ్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారన్నారు. బ్రిటీష్ సైనికులను పట్టుబడిన తర్వాత వారికి ఉరిశిక్ష ఖరారు చేశారన్నారు. బ్రిటిష్ వాళ్లకు క్షమాభిక్ష కోరితే క్షమించి వదిలేస్తామని అధికారులు అడిగితే భగత్ సింగ్ ఈ దేశానికి స్వతంత్రం రావాలంటే ఈ దేశం బాగుపడాలంటే ఉరితీయండన్నారని గుర్తు చేశారు. నేను చనిపోయినా నాలాంటి భగత్ సింగ్ లు వేల లక్షల కోట్లు దేశంలో తయారవుతారని, ఈ దేశంలోని బ్రిటీష్ వాళ్లను తరిమికొడతారని అన్నారని గుర్తు చేశారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిగా నిలిచాడని, ఆయన స్ఫూర్తితో స్వాతంత్రం వచ్చిందన్నారు. స్వతంత్రపోరాటంతో సంబంధం లేని బిజెపి పదేళ్లనుంచి ఈదేశాన్ని ఏలుతూ హిందూ ముస్లిముల మధ్య గొడవలు సృష్టించిందన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన, వైసిపి బిజెపికి తొత్తులుగా మారారన్నారు. ఇలాంటి వారిని ఎన్నికల్లో ఓడించాలన్నారు. కాంగ్రెస్ వామపక్ష పార్టీలను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండి బజారు సిఐటియు నాయకులు రాంబాబు, నాగస్వాములు, బజారి, ఫైరోస్ ,గోరా భాయ్, ఇలియాజ్ ,ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంనగర్‌లో.... కర్నూల్ నగరంలోని 23వ వార్డు శ్రీరామ్ నగర్ లో శ్రీ చైతన్య స్కూల్ దగ్గర శనివారం రాత్రి సిఐటియు, కెవిపిఎస్, డివైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవుల 93వ వర్ధంతిసభ నిర్వహించారు. కెవిపిఎస్ వార్డు నాయకులు జి.ఆంజనేయులు అధ్యక్షత వహించారు. భగత్ సింగ్, రాజ్ గురు,సుఖ్ దేవుల చిత్రపటానికి వీధి పెద్దలు జి.రత్నం, వి.వెంకట రమణ, కె.ఈశ్వరయ్య పి. నాగరాజు లు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యువకులు,వీధి పెద్దలుకొవ్వొత్తులు వెలిగించి విప్లవ వీరులకు జోహార్లు అంటూ, కాపాడుకుందాం భారత రాజ్యాంగాన్ని,, కాపాడుకుంటాం మతోన్మాద బిజెపి నుండి దేశాన్ని, అంటూపెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ జోహార్లు అర్పించారు. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు, నగర కార్యదర్శి సి.హెచ్ సాయిబాబా మాట్లాడారు. భారతదేశాన్ని కాపాడు కోవడం కోసం మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాలని ,వామపక్షాలను ఇండియా కూటమిని గెలిపించాలని, అమరవీరుల అడుగుజాడల్లో పయనించాలని పిలుపునిచ్చారు. కెవిపిఎస్ నాయకులు వై.నల్లన్న, నరసయ్య, రాజు, జె.రమణ, అలెగ్జాండర్, ఆర్. ఓబులేసు, డివైఎఫ్ఐ నాయకులు, జయంత్, ఆర్. బాలాజీ, ఎం. మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొతులతో నివాళ్లు అర్పిస్తున్న నేతలు

వంకలో పాత ఓటర్ గుర్తింపు కార్డులు

స్వాధీనం చేసుకున్న అధికారులు

ప్రజాశక్తి-తుగ్గలి



మండలం పరిధిలోని బొందిమడుగుల గ్రామంలోని పెద్దవంకలో ఓటర్ గుర్తింపు కార్డులు ఆదివారం కనిపించాయి. బొందిమడుగుల గ్రామానికి చెందిన ఎన్నికల ఓటర్ ఐడి కార్డులు ఎవరో వంకలో పారేయడంతో వాటిని గమనించిన బొందిమడుగులకు చెందిన కొందరు యువకులు తమ సెల్ ఫోన్లలో ఫోటోలు తీసి వాట్సాప్ గ్రూప్‌లలో షేర్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రామకృష్ణ యాదవ్, ఆర్ ఐ సుధాకర్ రెడ్డి, విఆర్ఒ భార్గవ్ లు బొంద్దిమడుగుల కు వెళ్లి వంకలో పడి ఉన్న 69 పాత ఓటర్ ఐడి కార్డులను స్వాధీనం చేసుకున్నారు. వంకలో ఎవరు పడేశారు అనే విషయంపై వారు విచారణ చేసి ఎన్నికల అధికారులకు తగు నివేదికలు పంపుతామన్నారు.

'కర్నూలు నగర ప్రజలకు ధన్యవాదాలు'

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ వారు గత రెండు రోజులుగా 500శాతం ఎఎండయాఎంఎస్ పైప్ లైన్ మరమ్మతులు దిగ్విజయంగా చేశారని నగర కమిషనర్ ఎ. భార్గవ్ తేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాలైన ఓల్డ్ కల్లూరు, కృష్ణానగర్, ఆదిత్య నగర్, జంపాల శివయ్య నగర్, కొత్త బస్టాండు, తిలక్ నగర్ చల్లవారివీధి (26, 27, 33, 35, 42) వార్డులలో మీ ప్రాంతాలలో యధావిధిగా నీరు సరఫరా జరుగుతుందని తెలిపారు. అందుకు సహకరించిన ఆయా వార్డుల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.



మట్టల ఆదివారం ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. ప్రశాంతి శ్యామ్

ఘనంగా మట్టల ఆదివారం ర్యాలి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు నగరంలో ఆదివారం మట్టల ఆదివారాన్ని పురస్కరించుకొని పలు ప్రధాన చర్చిలు ర్యాలీలు నిర్వహించాయి. కర్నూలు ఆర్ ఎస్ కూడలి లోని యెహోవా షమ్మా చర్చిలో సండే స్కూలు చిన్నారులు నిర్వహించిన ర్యాలీని ఎస్‌టిబిసి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ ప్రశాంతి శ్యామ్ ప్రార్థన చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ క్రీస్తు శిలువ శిక్షకు గురికాక ముందు ఆనాటి ప్రజలు, శిష్యులు క్రీస్తును ప్రభువుగా చెబుతూ చేసిన విజయోత్సవ ర్యాలీని గుర్తు చేసుకుంటూ ఈస్టర్ ఆదివారానికి ముందు ఆదివారం జరుపుకుంటారన్నారు. ఈ ర్యాలీలో సండే స్కూలు సూపరింటండెంట్ సంపత్ కుమారి, జయమ్మ, కవితాగ్రెస్, సోఫియా, వాలంటీర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

అవినీతి రెవిన్యూ అధికారులను కఠినంగా శిక్షించాలి

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రెవెన్యూ రికార్డులు తారుమారు చేశారని మనస్థాపం చెందిన కుటుంబం యావత్తు ఆత్మహత్యకు పాల్పడడానికి కారణమైన రెవెన్యూ అధికారులను వెంటనే సర్వీస్ నుండి రిమూవ్ చేసి హత్యా నేరం కింద కేసు నమోదు చేసి శిక్షించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామంలో చేనేత కుటుంబానికి చెందిన వారి భూమి సర్వే నంబర్ 21, 85లో ఉన్న మూడు ఎకరాలను అధికార పార్టీకి చెందిన వారికి రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, భూమి యజమాని సుబ్బారావు తమ భూమిని ఇతరులకు ఆన్‌లైన్‌లో నమోదు చేశారని ,మా భూమిని మాకే తిరిగి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ పెట్టుకొని సంవత్సర కాలంగా తిరిగినా స్పందించనందున మనస్థాపానికి గురై కుటుంబం యావత్తు చనిపోవడం కలచివేసిందన్నారు. ఒకరి భూమిని మరొకరికి ప్రలోభాలకు లొంగి ఆన్‌లైన్ చేయడం వల్ల ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని రెవెన్యూ శాఖ మొత్తం ఆలోచించాలన్నారు. ఒక కడప జిల్లాలోనే కాదు రాష్ట్రమంతా ఇటువంటి పరిస్థితులే ఉన్నాయన్నారు. ముఖ్యంగా కర్నూలు జిల్లాలో కూడా రైతులు తమ పొలాలను తమకు ఆన్‌లైన్ నమోదు చేయాలని సంవత్స రాలుగా తిరుగుతున్నప్పటికీ లంచం ఇవ్వలేదనే నెపంతో (అనగా లక్షల రూపాయలు) భూమిని రికార్డులో నమోదు చేయడం లేదని పేర్కొన్నారు. అటువంటి అధికారుల పైన తగిన నిగాపెట్టి చర్యలు తీసుకుని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. లేనిపక్షంలో రాష్ట్రమంతా ఇటు వంటి ఆత్మహత్యలే చోటు చేసుకుంటా య న్నారు. ఈ ఆత్మహత్యలను గుణపాఠంగా తీసు కొని మరొకచోట జరగకుండా చర్యలు చేపట్టాలని రామకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

27న ఐలమ్మ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27న ఉదయం 11 గంటలకు వీరనారి ఐలమ్మ పేరుతో నిర్మించిన రజక వృత్తిదారుల సంఘం కార్యాలయం ప్రారంభిస్తున్నామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన కార్మికకర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్నూలు జిల్లాలో అనేకమంది రజక వృత్తిదారులు అభిమానులు , ఇతర దాతల సహకారంతో రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ కార్యాలయం నిర్మాణం పూర్తి అయిందన్నారు. సంఘం కార్యాలయం కేంద్రంగా వృత్తిదారుల సమస్యలపై ఉద్యమాలు పోరాటాలు నిర్వహించడానికి తోడ్పడుతుందన్నారు. జిల్లాలోని రజక వృత్తిదారులందరూ వీరనారి ఐలమ్మ కార్యాలయం ప్రారంభ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ ప్రారంభ సభకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య, జిల్లాలోని రజక ఉద్యోగులు, మేధావులు పాల్గొంటున్నారని తెలిపారు. కర్నూలు న్యూ సిటీ కార్యదర్శి శేషాద్రి, అధ్యక్షుడు రాముడు, ఓల్డ్ సిటీ కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసులు, అధ్యక్షురాలు జయమ్మ, జిల్లా కమిటీ సభ్యులు ఎల్లయ్య, రవిశంకర్, కర్నూలు నగర నాయకులు మద్దిలేటి, కర్రేన్న, రాజు, పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యమే రాయలసీమ సమస్యలకు కారణం

వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

పాలకుల నిర్లక్ష్యమే రాయలసీమ సమస్యలకు కారణమని, రాయలసీమ గడ్డ వివక్షతల గడ్డ అని తెలంగాణ ఎమ్మెల్సీ ప్రముఖవాగ్గేయకారుడు గోరేటి వెంకన్న అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలోఉదయం లలితకళాసమితిలో బండినారాయణ స్వామి రచించిన మన సీమ కథలు పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. సభాధ్యక్షులుగా కథారచయిత డాక్టర ఎం.హరికిషన్ వ్యవహరించారు. పుస్తకాన్ని కానాపురం కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. పుస్తకంలోని కథలను విరసం నాయకులు పాణి, కథారచయిత మారుతీ పౌరోహితం సమీక్షించారు. ప్రత్యేక అతిథిగా కలం ప్రహ్లాద విశిష్టఅతిథిగా అనంతపురం యువకవి జిరసం జిల్లా ప్రధానకార్యదర్శి కొత్తపల్లి సురేష్ హాజరయ్యారు. ఈ సభలో గోరేటి వెంకటన్న మాట్లాడుతూ సీమ సాహిత్యంలో వైవిధ్యమైన సంస్కృతి, సాంప్రదాయాలు దాగి వున్నాయని అన్నారు. వివక్షను ఎదుర్కొంటూనే ఎదుగుతున్న సీమతనం గొప్పదన్నారు. పాలకుల నిర్లక్షమే సీమ సమస్యలకు కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. కేంద్రసాహిత్య అకాడమి పురస్కార గ్రహీత బండినారాయణ స్వామి మాట్లాడుతూ సీమ సాహిత్యం ఎన్నో బాలారిష్టాలను ఎదుర్కొంటూనే ఎదుగుతుందన్నారు. సీమకవులు తెలుగు సాహిత్యానికి విశేషకృషి చేస్తున్నారన్నారు. మారుతీ పౌరోహితం మాట్లాడుతూ సీమలో అవిభాజ్యమైన ప్రేమానురాగాలు దాగి ఉన్నాయని, ఇటీవల కాలంలో సీమసాహిత్యం కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. అనంతరం రాయలసీమ సాగునీటి ప్రణాళికా నిపుణులు సుబ్బరాయుడును ఘనంగా సత్కరించారు. ఆత్మీయ అతిథులుగా తిప్పిరెడ్డి నాగార్జున రెడ్డి, సీమ కృష్ణ, రవికుమార్,అశోక్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, పుల్లా రామాంజనేయులు హాజరయ్యారు. సభా నిర్వహణ సయ్యద్ జహీర్ అహ్మద్ ప్రమోద్ చక్రవర్తి, రాజా రమేష్, రాణి లీలావతి, పెరికల రంగస్వామి, డాక్టర కె.చంద్ర మౌళినిలు నిర్వహించారు.



సీమ కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోరేటి వెంకన్న , తదితరులు



బెల్టులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

క్రీడలతో శారీరక మానసిక ఆరోగ్యం

సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ.

పజాశక్తి - కర్నూలు హాస్పిటల్

తమ పిల్లలు గంజాయి లాంటి మత్తు ,మాదకద్రవ్యాలకు బానిసలుగా మారకుండా ఉండాలంటే తల్లిదండ్రులు వారిని క్రీడల్లో ప్రోత్సహించాలని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. కర్నూలు నంద్యాల చెక్‌పోస్టువద్ద శిరిడి సాయినగర్ మున్సిపల్ స్టేడియంలో మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడు రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బెల్టులను ప్రదానం చేశారు. డాక్టర్‌శంకర శర్మ మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాటంటే తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని చెప్పారు. ముఖ్యంగా కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందడం వల్ల దేహదారుఢ్యం , క్రమశిక్షణ, అంకిత భావం పెంపొందుతుందని చెప్పారు. క్రీడల్లో పాల్గొన్న పిల్లలు శారీరక మానసిక ఆరోగ్యం మెరుగుపడి చదువుల్లోనూ రాణిస్తారని చెప్పారు. దేశానికి నిజమైన సంపద భావిభారత పౌరులైన చిన్నారులేరని వారు క్రమశిక్షణ గల పౌరులుగా ఎదగాలంటే క్రీడలను మించిన సాధనం మరొకటి లేదని చెప్పారు. ముఖ్యంగా ఈ వేసవి నేపథ్యంలో ఎండలు ఎక్కువగా ఉన్న తరుణంలో నీటిని ఎక్కువగా తాగాల్సిన అవసరం ఉందని సూచించారు. లేదంటే డీహైడ్రేషన్ వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం తోపాటు మూత్రపిండాలు దెబ్బతినే అవకాశం ఉందని చెప్పారు. ఎండాకాలంలో కలుషితమైన నీటిని తాగడం వల్ల కలరా, మలేరియా, టైఫాయిడ్, పసిరికలు , జీర్ణకోశ సంబంధ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కర్నూలు నగరంలో క్రీడలను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం నిరంతరం ఉంటుందన్నారు.

వైభవంగా చెన్నసోమేశ్వర స్వామి రథోత్సవం

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలోని పోలకల్‌లో చెన్నసోమేశ్వరా స్వామి రథోత్సవం ఆదివారం తెల్లవారు జామున వైభవంగా సాగింది. ఈ జాతరకు జిల్లా నలుమూలల నుండే కాకుండా రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు వచ్చి రథోత్సవం సందర్శించారు. వచ్చిన భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. వివిధ రకాల పోటీల ప్రదర్శన కార్యక్రమాలు వేడుకగా సాగాయి. కోడుమూరు సిఐ మన్సూర్ ఉద్దీన్, సి బెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీస్ సిబ్బందితో వెళ్లి అవాంఛనియ సంఘటనలు జరగకుండా జాతరలో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

ఆలూరు అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తా

- వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వీరుపాక్షి


ప్రజలతో మాట్లాడుతున్న వీరుపాక్షి

ప్రజాశక్తి - ఆస్పరి

ఆలూరు అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని ఆలూరు వైసీపీ ఇంచార్జీ వీరుపాక్షి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిరుమన్ దొడ్డి,శంకర బండ గ్రామాలలో వైసీపీ ఇంచార్జీ వీరుపాక్షి పర్యటించారు. ముందుగా గ్రామాలలో వైసిపి నాయకులు పూలమాలలు వేసి బాణసంచా కాలుస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో ఆలూరు అసెంబ్లీ నుండి బుసినేని విరుపాక్షి, కర్నూలు పార్లమెంటు సభ్యునిగా బివై.రామయ్యను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి రాగానే వేదవతి ప్రాజెక్ట్,నగర డోణ రిజర్వాయర్ ద్వారా ఆస్పరి మండలానికి నీరు అంధించే బాధ్యత నాది అన్ని ప్రజలకు హామీ ఇచ్చారు. మండలంలో అనేక గ్రామాలలో నీటి సమస్య,డ్రైనేజీ,సిసి రోడ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని త్వరలోనే పరిష్కరిస్తారన్నారు. సంక్షేమ పథకాలు అందాలంటే మరోసారి జగన్మోహన్ రెడ్డిని మరోసారి ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే రాష్ట్రం మరింత ముందుకు అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఆలూరు నుంచి ఎమ్మెల్యేగా విరుపాక్షి అనే నన్ను గెలిపించి జగన్మోహన్ రెడ్డి బహుమతిగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆస్పరి,చిప్పగిరి మండల కన్వీనర్లు పెద్దయ్య, మార్యయ్య,జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రాఘవేంద్ర, సొసైటీ చైర్మన్ గోవర్ధన్, కో–కన్వీనర్ పురుషోత్తమ రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ బసవరాజు,నాయకులు కేశవరెడ్డి,దత్తరెడ్డి,రాజన్న గౌడ్, తిమ్మప్ప, శివ,లక్ష్మణ,కౌలుట్ల సర్పంచ్ లు విజయలక్ష్మి, వెంకటేష్,ఆయా గ్రామాల ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుండి మినహాయించాలి

- ఎస్‌టియు



సమావేశంలో మాట్లాడిన నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల విధుల నుండి దీర్ఘకాలిక వ్యాధులున్న, గర్భిణీ, చంటి పిల్లలున్న ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని ఎస్‌టియు జిల్లా కార్యదర్శి బి గోపాల్, రాష్ట్ర కౌన్సిలర్ బి మహదేవప్ప ఎన్నికల రిటర్నింగ్ అధికారులను కోరారు. ఆదివారం ఆదోనిలోని ఎస్టీయు భవన్‌లో మండల ఆర్థిక కార్యదర్శి పి శేక్షావలి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇటీవల కర్నూలులో జరిగిన హెల్త్ క్యాంపుకు హాజరై స్క్రీనింగ్ చేయించుకున్న ఉపాధ్యాయులకు సైతం ఎన్నికల విధులు ఆర్డర్లు రావడం విస్మయానికి గురిచేసిందన్నారు. ఆరోగ్య సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు మానవతా దృక్పథంతో ఎన్నికల విధుల నుండి మినహాయించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసి సుంకన్న, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు బి రామాంజనేయులు, ఆదోని మండల అధ్యక్ష కార్యదర్శులు బి సుధాకర్ బాబు, సి.రామకృష్ణ పాల్గొన్నారు.

'గడపగడప' నిధులతో అభివృద్ధి పనులు

పజాశక్తి - కౌతాళం


వేసిన రోడ్డు


గతంలో ఉన్న రోడ్డు

గడపగడప నిధులతో మండల కేంద్రమైన కౌతాళంలో అభివృద్ధి పనులు పరుగులు తీశాయి. గ్రామంలో మూడు సచివాలయాలకు ఒక్కొక్క సచివాలయానికి రూ.40 లక్షల ప్రకారం కోటి 40 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామంలోని ఉప్పర్ గిరి, పల్లెద గేరి, కామవరం రస్తాలో సిమెంట్ రోడ్లు, హనుమాన్ నగర్‌లో డ్రైనేజ్ గ్రావెల్ రోడ్డు ముమ్మరంగా పనులు చేపట్టారు. గడప గడప కార్యక్రమంలో ప్రజలు నాయకుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించడానికి మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి ఆదేశించడంతో గ్రామ నాయకులు అభివృద్ధి పనులు చేపట్టారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాద చారి, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, ఉప సర్పంచ్ సక్రి తిక్కయ్య పనులను ఏకాంతం చేశారు. గ్రామ సర్పంచ్ పాల్ దినకరన్ గ్రామ నాయకులతో కలిసి అభివృద్ధి పనులను ఎక్కడెక్కడ అవసరం ఉన్నాయో గుర్తించడం జరిగింది. దీంతో గతంలో అధ్వానంగా ఉన్న రోడ్లు నేడు సిసి రోడ్లతో కళకళలాడుతున్నాయి.

మొదలైన తాగునీటి ఎద్దడి


ఎల్ఎల్సి లో నీటి ప్రవాహం ఉన్న దృశ్యం


ఆదోని బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ లో నిల్వ ఉన్న నీరు


పైపుల ద్వారా నీరు తోడుకుంటున్న మహిళ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో త్రాగునీటి ఎద్దడి తప్పదా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఎండాకాలంలో నీటి వినియోగం పెరుగుతోంది. అందుకనుగుణంగా నీటి సరఫరా జరిగేనా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. క్రాంతి నగర్, రాజా సాహెబ్ నగర్, భాస్కర్ రెడ్డి కాలనీ, వైయస్సార్ కాలనీ, భీమ్ రెడ్డి కాలనీ, ప్రశాంత్ నగర్, ఇంద్రనగర్ శివారు ప్రాంతాలలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి.

రోజుమార్చి రోజు నీరు...

ఆదోని పట్టణంలో రోజుమార్చి రోజు నీరు వదిలేందుకు అవకాశం ఉన్న ఐదు రోజులు ఒకసారి సరఫరా చేస్తున్నారు. ఆదోనికి రెండు చెరువుల ఉన్నప్పటికీ రామ్ జల చెరువును నిరుపయోగంగా ఉంచడం వల్ల బసాపురం సన్మాన స్టోరేజ్ ట్యాంక్‌పైనే ఆధార పడాల్సిన పరిస్థితి ఉంది. మరో చెరువు నిర్మించాలని ప్రజల నుండి డిమాండ్ ఉంది.

సమస్యలు ఇలా..

బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుండి నీటి సరఫరాలో పైపులు పగలడం, విద్యుత్ అంతరాయం వంటి సమస్యలు తలెత్తే అవకాశాలు లేకపోలేదని పురవాసులు చర్చించుకుం టున్నారు. ఇప్పటికే వారంలో ఒక దఫా నీరు వదులుతున్నారు. ఆ సమయంలో ఎక్కడికైనా వెళితే నీటి కోసం పడే ఇబ్బందులు అంతా ఇంతా కాదని పరపురవాసులు చర్చించుకుంటు న్నారు. పురవాసులకు ఎండాకాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటు న్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్న ఇప్పటికే సమస్య మొదలైందని పలువురు చెబుతున్నారు.

అసంపూర్తిగానే పనులు ..

ఎస్ ఎస్ ట్యాంక సైడ్ వాల్ కృంగిపోవడంతో యుద్ధ ప్రాతిపదికన పనులు జరిగాయి. మూడు నెలలు క్రితం ప్రభుత్వం రూ 55 లక్షలు మంజూరు చేసిందని బండ్ తాత్కాలిక పనులను యుద్ధ ప్రాతిపదికన చేసేందుకు పూనుకున్నామని అధికారులు చెప్పారు. ట్యాంక్‌లోనే సైడ్‌వాల్‌కు సపోర్టుగా ఇసుక సంచలు పేర్చి బండ్ కృంగిపోకుండా తాత్కాలిక ంగా పునరుద్ధరణ పనులు పూర్తిచేశారు. తుంగభద్ర డ్యామ్ నుండి తాగునీటి పర్పస్ కోసం ఎల్ఐసి కాల్వకు నీరు వదిలారు. ఎల్ఎల్‌సి నుండి ట్యాంకులోకి నీటి మళ్లింపు జరుగుతుంది. ప్రస్తుతం నాలుగు మోటర్లు ఉన్నాయని అదనంగా మరో రెండు అమర్చి 16 రోజుల్లోగా ట్యాంకు నిండేలా ఏర్పాటు చేస్తున్నామని, ట్యాంకు సామర్థ్యం 3110 ఎమ్మెల్ లీటర్ల కెపాసిటీ ఉండగా కనీసం 80 శాతం అయినా నీటి నిల్వకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు

- వెంకట చలపతి రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్.



ఎండాకాలంలో నీటి ఎద్దడి రాకుండా ఈ చర్యలు చేపట్టాము. కాలువలో నీటి ప్రవాహము తగ్గట్టుగానే మోటర్లు ఏర్పాటు చేసి ట్యాంకులోకి మళ్ళిస్తున్నాము. టెక్నికల్ అధికారుల సూచన మేరకు బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లో 80 శాతం నీరు నిలువకు అవకాశం ఉంది ఆ నీరు కూడా రెండు నెలలు సరిపోయే అవకాశం ఉంది. మరో జూన్‌లో కాలువకు నీరు వస్తాయని అప్పుడు నిల్వకు చర్యలు చేసుకుంటాము. ట్యాంకు చుట్టూ కొత్తగా సైడ్ వాలు నిర్మించేందుకు రూ 24 కోట్ల 40 లక్షలు అవసరము అవుతుందని దీనికి గాను ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాము. ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా తాత్కాలిక పనులు చేపట్టి అనుమతి రాగానే పూర్తిగా పునరుద్ధరణ పనులు చేయిస్తాం. తాగునీటి కోసం ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

29న 'మేము సిద్ధం'

- బహిరంగ సభను విజయవంతం చేద్దాం : వైసిపి
- సీఎం జగన్ పర్యటన ఏర్పాట్లను పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా నాయకులు

పజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 29న ఎమ్మిగనూరులో వీవర్స్ కాలనీ మైదానంలో మేమంతా సిద్ధం సభ ప్రాంగణాన్ని జిల్లా పార్టీ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, కర్నూలు జిల్లా పార్టీ అధ్యక్షులు పార్లమెంట్ అభ్యర్థి బివై రామయ్య, ఎమ్మిగనూరు శాసన సభ్యులు చెన్నకేశవరెడ్డి, ఎమ్మిగ నూరు వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక, సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పరిశీలించారు. ఆదివారం సభాస్థలిని పరిశీలించిన తర్వాత ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవల నాలుగు ప్రాంతాల్లో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన సిద్ధం సభలు విజయవంతం అయ్యాయని అదే ఉత్సాహంతో ముఖ్య మంత్రి బస్సు యాత్ర ప్రారంభి స్తున్నారన్నారు. ఈనెల 29న ఎమ్మిగనూరులో ఉంటుందని చెప్పారు. అలాగే ప్రజలతో మాట్లాడతారని పేర్కొన్నారు. ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించడమే కాకుండా ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు. మేమంతా సిద్ధం సభను పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ సమ న్వయ కర్తలు, పార్టీ ప్రజాప్రతినిధులు, పరిశీలకులు, పార్టీ నాయ కులు, కార్యకర్తలు కలిసికట్టుగా విజయవంతం చేయాల న్నారు. రాయలసీమ ప్రాంతంలో వైయస్సార్సిపి బలంగా ఉందని, వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్య మంత్రిని చేసేందుకు ఇక్కడి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనైతిక పొత్తు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఏనాడు ఒంటరిగా పోటీ చేయలేదని పేర్కొన్నారు. 14 సంవ త్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేశానని చెప్పుకునే చంద్ర బాబు.. జగన్‌ను చూసి భయపడి అనైతిక పొత్తు పెట్టుకు న్నారన్నారు. ఈ పొత్తును ప్రజలు నమ్మబోరన్నారు. ఒక్క శాతం ఓట్లు లేని వారితో, ఒక్క సీటు కూడా గెలవలేని వారి తో పొత్తు పెట్టుకోవడం టీడీపీ దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. గతంలో మోదీని తీవ్రంగా విమర్శించి ఇప్పుడు పొత్తు పెట్టుకున్నాడని, అందితే జుట్టు అంద కుంటే కాళ్లు పట్టుకోవడం చంద్రబాబుకే చెల్లుబాటు అవుతుంద న్నారు. కర్నూలు జిల్లాలో మరోసారి 2019 సంవత్సరం ఎన్ని కల ఫలితాలే పునరావృతమవుతాయని అన్నారు. రాష్ట్ర ంలో మళ్లీ వైఎస్సార్సీపీ ప్రభుత్వమే వస్తుందన్నారు. ఇప్పటికే కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించామన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతుల్లో కొంత జాప్యం జరిగిందన్నారు. ఇప్పటికే మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త, వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్ ఏర్పాటయ్యా యన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. జగన్నాథగట్టు వద్ద రూ.1000 కోట్లతో న్యాయ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేశారన్నారు. కర్నూలును న్యాయరాజధానిగా కొనసాగిస్తామ న్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ,ఉన్నత వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారందరికీ ఈ ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలిచిందన్నారు. ఎన్నిక లకు మరింత సమయం ఉందని, అభ్యర్థుల విజయా నికి పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బుట్టా శివనీలకంఠ, బుట్టా ప్రతుల్ బుట్టా నాగరాజు, ఎమ్మిగనూరు వైసీపీ పట్టణ అధ్యక్షులు, బుట్టా రంగయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్, కౌన్సిలర్లు బజారి, శివప్రసాద్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీవీ జయనాగేశ్వర రెడ్డి

వైసిపి దాష్టీకానికి చేనేత కుటుంబం బలి

- సిఎం ఏం సమాధానం చెబుతారు ?
- టిడిపి అభ్యర్థి బివి జయనాగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వైసీపీ ప్రభుత్వ దాష్టీకానికి కడప జిల్లాలోని చేనేత కుటుంబం బలైందని, వైసీపీ నేతల కబ్జాకాండ నిండు కుటుంబం ఉసురు తీసిందని ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థి బివి జయనాగేశ్వర రెడ్డి మండిపడ్డారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కబ్జారాయుళ్లతో పోరాడలేక బీసీ కుటుంబం ప్రాణాలు తీసుకుందని, మాటలకందని విషాదం ప్రతి ఒక్కరినీ ఆందోళనలో పడేస్తోందన్నారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరంలో జరిగిన ఘటనకు సీఎం ఏం చెబుతారని ప్రశ్నించారు. ఎంత ఆవేదన చెందితే ఇలా ప్రాణాలు తీసుకుం టారో తెలుసా అని మండిపడ్డారు. సొంత జిల్లాలో జరిగిన ఘటనపై జగన్ తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు. జగన్ రెడ్డి సొంత జిల్లాలోని ప్రజలకు రక్షణ లేదని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల పరిస్థితి ఏంటని నిలదీశారు. ఆత్మహత్య ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- చిప్పగిరి మాజీ సర్పంచ్ సురేష్ రెడ్డి, దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి - చిప్పగిరి : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని చిప్పగిరి మాజీ సర్పంచ్ సురేష్ రెడ్డి, వ్యాపారవేత్త కుందన గూర్చి దివాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండలం పరిధిలోని కుందనగుర్తి గ్రామంలో సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా ఆలూరు ఎస్పీ 11, చిప్పగిరి నాకోట్ లెవెన్ జట్టుల మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించగా ఆలూరు ఎస్పీ 11 విజయం సాధించింది. గెలుపొందిన జట్టుకు రూ.20,000 ప్రైజ్ మనీని స్పాన్సర్స్ దివాకర్ రెడ్డి, కేదార్నాథ్ రెడ్డి ఆలూరు ఎస్పీ 11 కెప్టెన్ తేజాకు ట్రోఫీతో పాటు అందజేశారు. అనంతరం రన్నర్ ప్రైస్‌ను చిప్పగిరి నాకోట్ 11కు స్పాన్సర్ చిప్పగిరి మాజీ సర్పంచ్ సురేష్ రెడ్డి రూ.10,000 తోపాటు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు యువతలో మానసిక ఉల్లాసాన్ని కలిగి చేస్తాయని అన్నారు. క్రీడల ఆడటం వల్ల శరీరం ధృఢంగా ఉంటుందని, ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపవచ్చని,ప్రతి ఒక్కరిలో ఎదో ఒక టాలెంట్ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు నాగభూషణ్ రెడ్డి, విజయ్ మోహన్ రెడ్డి, ధనుంజయ రెడ్డి,ధనుంజయ, మేఘనాథ్,మనోజ్, బసవరాజు, పవన్ కుమార్,శేఖర్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


క్రీడాకారులతో సురేష్ రెడ్డి, దివాకర్ రెడ్డి

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-ఆలూరు

ప్రభుత్వ ఆదర్శపాఠశాలలో 2024–2025 సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశమునకు దరఖాస్తూ చేసుకోవాలని ఆలూరు ఆదర్శ పాఠశాల(మోడల్ స్కూల్)ప్రిన్సిపాల్ రాఘవరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశము కొరకై 10వ తరగతి పాసైన వారు ఆన్ లైన్‌లో ఎంపిసి/బైపిసి/ఎంఈసి/సిఈసి గ్రూప్‌లకు దరఖాస్తూ చేసుకోవచ్చు అని పేర్కొన్నారు. దరఖాస్తుకు వెబ్ సైట్ https://apms.apcfss.in, https://cse.ap.gov.in చూడా లన్నారు. దరఖాస్తూ చేసుకోనెందుకు ఈ నెల 28 నుండి మే 22 వరకు ఓసి,బిసి,ఈ డబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ. 200, ఎస్సి,ఎస్టి విద్యార్థు లకు రూ 150 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల మెరిట్, రూల్స్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎంపిక ఉంటుందన్నారు.

'ఇండియా' అభ్యర్థులను గెలిపించుకుందాం : సిపిఐ

ప్రజాశక్తి - ఆదోని


సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించి రాష్ట్రాన్ని దేశాన్ని కాపాడుకుందామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి రామచంద్రయ్య రాష్ట్ర ప్రజలను కోరారు. ఆదివారం ఆదోనిలోని సిపిఐ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి ఎస్ సుదర్శన అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల కంటే ఈ ఎన్నికలు చాలా భిన్నమైనవన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ సమైక్యత, సమగ్ర, లౌకికవాదం ప్రధానమైన హక్కులు హరించే పద్ధతులలో పరిపాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కులమతాలను రెచ్చగొట్టి గొడవలు సష్టించి పరిపాలన కొనసాగిస్తున్నారని, మెజార్టీగా ఉన్న హిందువుల ఓట్లను కొల్లగొట్టి తిరిగి అధికారంలోకి రావాలని విశ్వ ప్రయ త్నాలు చేస్తున్నారన్నారు. ప్రధానమైన ప్రభుత్వ రంగ సంస్థలైన టెలికాం ఎల్ఐసి రైల్వే చివరికి అంతరిక్ష పరిశోధన కేంద్రాలను కూడా కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారని అన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ఇచ్చిన హామీలు నేటి వరకు నెరవేర్చలేదని విమర్శించారు. బిజెపికి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కలుబావిరాజు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు టి వీరేష్ సిపిఐ సీనియర్ నాయకులు పస్తాపురం గోపాల్ బస్సాపురం గోపాల్ ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు షేక్షావలి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు నరసప్ప ఎల్లప్ప వీరేష్ కులవృత్తుల సంఘం జిల్లా కార్యదర్శి కారన్న దళిత సంఘం నాయకులు గురుదాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

సీనియర్ నేతను కలిసిన టిడిపి ఎంపి అభ్యర్థి

ప్రజాశక్తి - ఆదోని


బొకే అందజేసిన బత్తిని లక్ష్మినారాయణ

కర్నూల్ ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజు ఆదివారం ఆదోనిలో పర్యటించారు. పారిశ్రామిక వేత్త టిడిపి సీనియర్ నాయకుడు బత్తిని లక్ష్మీనారాయణ, యువ నాయకుడు బత్తిని కురేర్ నాథ్‌ను వారి నివాసంలో కలిశారు. ఆయనకు బొకేతో స్వాగతం పలికారు. గెలుపుకు ప్రజల్లో చైతన్యాన్ని ఎలా తీసుకురావాలనే విషయాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచలింగాల నాగరాజుకు మద్దతు తెలుపుతూ అధిక మెజార్టీతో గెలిపిస్తామని పంచలింగాల నాగరాజుకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి యంగ్ డైనమిక్ లీడర్ ముత్తుకూరు మల్లికార్జున, మాజీ ఎంపిటిసీ, ఆలూరు నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకుడు లాలి కుమార్, టిడిపి యువ నాయకుడు కె జితేంద్ర కుమార్, టిడిపి యూత్ లీడర్భ బత్తిని కుబేర్ యూత్ పాల్గొన్నారు.

ఆదోనిలో పోలీసు కవాతు

ప్రజాశక్తి - ఆదోని

రాబోయే జనరల్ ఎలక్షన్‌లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలకు అండగా ఉంటామని ఆదోని డీఎస్పీ శివ నారాయణ శర్మ పేర్కొన్నారు. ఆదివారం ఆదోని పట్టణంలో సెంట్రల్ పోలీసులు భారీ కవాతు నిర్వహించారు. కర్నూలు ఎస్‌పి కృష్ణకాంత్ ఆదేశాల మేరకు డిఎస్‌పీ శివ నారాయణ స్వామి పర్యవేక్షణలో ఆదోని పట్టణంలో కవాతు కొనసాగింది. సెంట్రల్ ఫోర్స్, ఎస్–ఎస్‌బి పోలీసులు సంయుక్తంగా సాగారు. ఆదోనిలోని తిక్కస్వామి దర్గా, చిన్న మార్కెట్, షరాఫ్ బజార్, హవన్నపేట, కార్వాన్ పేట ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఓటర్లు తమ ఓటును నిర్భయంగా వేసేందుకు భరోసా కల్పించడమే ఈ ఫ్లాగ్ మార్చ్ ఉద్దేశ్యమని డిఎస్‌పి శివ నారాయణ స్వామి అన్నారు. అవాంఛనీయ సంఘటన జరిగిన ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసిన తమకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కవాతులో ఆదోని త్రీటౌన్ సీఐ నరసింహరాజు, వన్ టౌన్ సిఐ తేజామూర్తి, టుటౌన్ సీఐ గోపి, త్రీటౌన్ ఎస్ఐ నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.


కవాతు నిర్వహించిన పోలీసులు

ఘనంగా మట్టల వేడుకలు

ప్రజాశక్తి-ఆలూరు

మండల పరిధిలోని మొలగవల్లి సిఎస్ఐ చర్చిలో మట్టల వేడుకలను క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని క్రైస్తవులు ఈత మట్టలతో ప్రదర్శన నిర్వహించారు. ఏసుక్రీస్తును క్రైస్తవులు మట్టలతో ఊరేగించారని అందుకే ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా ఈ మట్టల ఆదివారం కార్యక్రమాన్ని క్రైస్తవులు నిర్వహిస్తారని పాస్టర్లు రెవరెండ్ పుసైల కుమార్, సంఘ పెద్దలు దేవపుత్ర,ఆశీర్వాదం, దాసప్ప,రాజు, సురేష్,ధర్మన్న సంఘ కాపరి సత్యానందం,భాస్కర్ యూత్ సభ్యులు పి.ప్రసాద్,ఎస్ బెన్నీ,రాజు గోపాల్, ఇమ్మానేలు, మహేష్,ప్రకాష్ పాల్గొన్నారు.

దేవనకొండ : మండల పరిధిలోని తెర్నేకల్ గ్రామంలో ఎ.బి.యం.చర్చి సండే స్కూల్ చిన్నారులు మట్టల ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలో చిన్నారులు ఈత మట్టలతో క్రీస్తు పేరుతో వచ్చేవారికి జయము జయము సర్వోనతమైన స్థలములు దేవునికి మహిమ అంటూ విజయో త్సవంతో గ్రామంలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎ.బి.యం. చర్చి సండే స్కూల్ టీచర్స్ సతీష్, ఆశీర్వదం, షాలేము రాజు, సిసింద్రీ ,ప్రభాకర్ పాల్గొన్నారు.


మొలగవల్లి కొట్టాల చర్చి లో మట్టల ప్రదర్శనలో క్రైస్తవులు


తెర్నే కల్లులో మట్టల ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

అనాథ శవానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - దేవనకొండ : ఎక్కడ నుండి వచ్చాడో ఏ ప్రాంతానికి చెందిన వాడు తెలియదు. మండల కేంద్రమైన దేవనకొండ సి ఎల్ ఆర్ సి భవనం సమీపంలో ఓ అనాథ వ్యక్తి(52) సంవత్సరాలు ఆదివారం మతి చెందిన సంఘటన చోటుచేసు కుంది. ఈ సమాచారం తెలుసుకున్న స్థానిక సీఐ శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలపై ఆరా తీశాడు. అయితే మృతుని వద్ద ఎలాంటి వివరాలు లభించకపోవడంతో అనాథ వ్యక్తిగా గుర్తించి పంచాయతీ సిబ్బందికి అప్పగిం చారు. దీంతో గ్రామపంచాయతీ సిబ్బంది అనాథ శవానికి అంతక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.


అంతక్రియలు నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది